పది పరీక్షలకు సర్వం సిద్ధం

- రేపటి నుంచి రోజు విడిచి రోజు పరీక్షలు
- పాలకొల్లు నియోజవకర్గంలో పరీక్షలు రాయనున్న 3,122 మంది విద్యార్థులు

పాలకొల్లు సెంట్రల్: విద్యార్థుల కెరీర్‌కు పదో తరగతి పరీక్షలు చాలా కీలకం. ఏడాదంతా కష్టపడి చదివిన విద్యార్థులు తమ ప్రతిభా పాటవాలను పరీక్షించుకునే సమయం ఆసన్నమైంది. ఈనెల 17 నుంచి 31 వరకు పదో తరగతి పబ్లిక్ పరీక్షలు నిర్వహించనున్నారు. 17న తెలుగు, 19న హిందీ, 21 ఇంగ్లిషు, 24 గణితం, 26 ఫిజిక్స్, 28 బయోలజీ, 31 సోషల్ పరీక్షలు నిర్వహించనున్నారు. పాలకొల్లు నియోజవకర్గంలో 3,122 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. వీరికి 19 పరీక్షా కేంద్రాలను అధికారులు ఏర్పాటుచేశారు. పరీక్షా కేంద్రాల వద్ద మెడికల్ క్యాంపు, ఓఆర్ఎస్ ద్రావణం ప్యాకెట్లు, తాగునీటి సదుపాయం కల్పించనున్నారు. 144 సెక్షన్ అమలులో ఉంటుంది.

పరీక్షా కేంద్రాలు

పాలకొల్లు పట్టణంలో 8, మండలంలో 3, యలమంచిలి మండలంలో 5, పోడూరు మండలంలో 3 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు.



బివిఆర్ మునిసిపల్ బాలికోన్నత పాఠశాలలో చదువుకుంటున్న పదవ తరగతి విద్యార్థినులు

పాలకొల్లు పట్టణం : రైల్వే గేటు వద్ద పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న బీఆర్ఎంవీ మునిసిపల్ హైస్కూల్, యడ్లబజారు సెంటర్ వద్ద ఎంఎంకేఎస్ఎస్ మునిసిపల్ హైస్కూల్, హౌసింగ్ బోర్డు కాలనీ టీటీడీ కల్యాణ మండపం పక్కన సుభాష్ చంద్ర బోస్ మునిసిపల్ హైస్కూల్, చిన్న కూరగాయల మార్కెట్ వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద బీవీఆర్ మునిసిపల్ గరల్స్ హైస్కూల్, దొడ్డిపట్ల రోడ్డులో ఏఎస్ఎన్ఎం కళాశాల దాటిన తరువాత సెంట్ మెరిస్ హైస్కూల్, బ్రాడీపేట బైపాస్ రోడ్డులో ఉన్న ఆదిత్య పబ్లిక్ స్కూల్, బ్రాడీపేట రామచంద్ర గార్డెన్స్ దాటిన తరువాత శ్రీ చైతన్య టెక్నో స్కూల్, పూలపల్లి మలుపులో ఉన్న గౌతమి ఇంగ్లిష్ మీడియం స్కూల్.

మండలాల్లో..:

పాలకొల్లు మండలం లంకలకోడేరు జెడ్పీ హైస్కూల్ (ఏ, బీ సెంటర్), శివదేవుని చిక్కాల జెడ్పీ హైస్కూల్, యలమంచిలి మండలం యలమంచిలి, కాజ, దొడ్డిపట్ల, మట్లపాలెం, ఏనుగువానిలంక, పోడూరు మండలం పోడూరు, జిన్నూరు, గుమ్ములూరు జెడ్పీ హైస్కూళ్లు.

పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు

మండలం	ప్రభుత్వ	ప్రైవేటు
పాలకొల్లు పట్టణం	465	905
పాలకొల్లు మండలం	443	159
యలమంచిలి మండలం	565	30
పోడూరు మండలం	531	24

వాహనాలు ఇవ్వవద్దు



పదో తరగతి విద్యార్థులకు వాహనాలు ఇవ్వవద్దు. పరీక్షా కేంద్రం దూర ప్రాంతాల్లో ఉంటే అవసరమైతే ఓ అరగంట ముందే చేరుకునేలా బయలు దేరాలి. పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని తల్లిదండ్రులే కేంద్రాల వద్దకు తీసుకువెళ్లండి. విద్యార్థులు వాహనాలపై వెళ్లే సమయంలో పోలీసులు తనిఖీలు చేస్తే ఆ సమయం కూడా వృథా అవుతుంది.

– కోలా రజనీకుమార్, సీఐ, పాలకొల్లు

మనోస్థైర్యం అవసరం



విద్యార్థులు ఏకాగ్రత కోసం రోజూ తప్పనిసరిగా పది నిమిషాలు వ్యాయామం, ధ్యానం, బ్రీతింగ్ ఎక్సర్‌సైజ్‌లు చేయాలి. బాగా చదవగలననే మనోస్థైర్యంతో ఉండాలి. టీవీ, సెల్‌ఫోన్, సినిమాలు వంటి వాటికి దూరంగా ఉండాలి. పిల్లలకు లైట్ ఫుడ్, ఫ్రూట్ జ్యూస్‌లతోపాటు అలసట లేకుండా బార్లీ, సగ్గుజావ, సబ్జా గింజలు, మజ్జిగ వంటివి అందించాలి.

– ధన శేఖర్, మానసిక నిపుణులు, పాలకొల్లు

టైమ్ మేనేజ్‌మెంట్ అలవాటు చేసుకోవాలి



ప్రతి విద్యార్థి ప్రణాళికబద్ధంగా చదువేలా ఉపాధ్యాయులు కృషి చేస్తునే ఉన్నారు. వెనుకబడిన సబ్జెక్టును ఎక్కువగా రివిజన్ చేసుకునే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దారు. విద్యార్థులు పాత పాఠ్యాంశాలు రివిజన్ చేసుకుంటుండాలి. ఒకటి, రెండు మార్కులు, డయాగ్రామ్స్, మ్యాప్‌లు, నిర్మాణాలు వంటివాటిపై ఎక్కువ దృష్టి పెడితే ఎక్కువ మార్కులు సాధించగలరు.

– గుమ్మళ్ల వీరాస్వామి, ఎంఈఓ–1, పాలకొల్లు

క్లుప్తంగా

ఏఎస్ఎన్ఎం కళాశాల కరపత్రం విడుదల



కళాశాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ రాజరాజేశ్వరి

పాలకొల్లు సెంట్రల్: స్థానిక అద్దేపల్లి సత్యనారాయణ మూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సీనియర్ అధ్యాపకులతో ఉన్నతమైన విద్యాబోధన అందిస్తున్నట్టు ప్రిన్సిపాల్ టి.రాజరాజేశ్వరి తెలిపారు. శనివారం ఆ కళాశాలలో తన చాంబర్‌లో అధ్యాపకులు, సీపీడీసీ సభ్యుల సమక్షంలో 2025–26 విద్యా సంవత్సరం ప్రవేశానికి సంబంధించిన కరపత్రాన్ని ప్రిన్సిపాల్ రాజరాజేశ్వరి విడుదల చేశారు. కార్యక్రమంలో సీపీడీసీ సెక్రటరీ బీవీ రాఘవయ్య, వైస్ ప్రిన్సిపాల్ టి.కృష్ణ, ఐక్యూ కోఆర్డినేటర్ కె.భద్రాచలం, యామిని, పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పెనుగొండ అభివృద్ధికి తీర్మానాలు



పంచాయతీ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పితాని

పెనుగొండ: పెనుగొండ గ్రామాభివృద్ధికి తన వంతు తోడ్పాటు అందిస్తానని ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. పెనుగొండ పంచాయతీ సర్వసభ్య సమావేశం స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం సర్పంచ్ నక్కా శ్యామల అధ్యక్షతన నిర్వహించారు. గ్రామాభివృద్ధిపై చర్చించారు. 47 తీర్మానాలను వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి టి.రత్నాకరరావు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

వేములదీవి వెంకన్న పూజలు



వేములదీవి వెంకన్న

నరసాపురం రూరల్: మండలంలోని వేములదీవి కాపులకొడప వెంకటేశ్వరస్వామికి శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు పెద్దింటి అరుణ్‌కుమార్ ఆచార్యులు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం అన్న ప్రసాదం స్వీకరించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో భజన కార్యక్రమం చేశారు.

పశువులకు టీకాలు



గుంపర్రులో పశువులకు టీకా వేస్తున్న దృశ్యం

యలమంచిలి: మండలంలోని గుంపర్రు, ఇలపకుర్రు గ్రామాల్లో శనివారం 56 ఆవులు, 174 గేదెలకు, 26 లేగ దూడలకు గాలి కుంటు వ్యాధి (గాళ్ల వ్యాధి) రాకుండా టీకాలు వేసినట్టు డాక్టర్ చంద్రశేఖరరెడ్డి తెలిపారు. పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



పట్టుబడిన రేషన్ బియ్యం

ఆకివీడు: అక్రమంగా తరలిస్తున్న ఐదు టన్నుల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు ఆకస్మిక దాడి చేసి స్వాధీనం చేసుకున్నట్లు సివిల్ సప్లై డీటీ మహేష్ శనివారం చెప్పారు. మండలంలోని కుప్పనపూడి శివారు తాళ్లకోడులో దాసరి శ్రీనివాస్‌కు సంబంధించిన రేషన్ బియ్యాన్ని లోడ్ చేసి తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. బియ్యాన్ని సీజ్ చేసి ఉండిలోని సివిల్ సప్లై ఎంఎల్ఎస్ పాయింట్‌లో అప్పగించి, కేసు నమోదు చేయించనున్నట్లు చెప్పారు.

వరాల వెంకన్నకు ప్రత్యేక పూజలు

అత్తిలి: అత్తిలి మండలం ఈడూరు గ్రామంలో వరాల వెంకటేశ్వరస్వామికి శనివారం విశేష పూజలు జరిపారు. వేకువ జామున స్వామివారికి సుప్రభాతసేవ, తోమాలసేవ, ఉదయం అర్చనలు జరిపారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో పూజాది కాలను నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని తులసిమాలలు, పలు రకాల పుష్పాలతో విశేషంగా అలంకరించారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు కాలినడకన హాజరై స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

సిద్ధాంతంలో కృష్ణ మందిరం ప్రారంభం

పెనుగొండ: మండలంలోని సిద్ధాంతం గ్రామంలో భీమవరం ఉద్దరాజు ఫౌండేషన్, ఆనంద్ గ్రూప్ ఆఫ్ కంపెనీ చైర్మన్ ఉద్దరాజు కాశీ విశ్వనాథరాజు ఆధ్వర్యంలో నిర్మించిన చావలి పేరమ్మ కృష్ణ మందిరాన్ని శనివారం రాత్రి ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ గజల్ శ్రీనివాస్‌తో కలిసి ప్రారంభించారు. చావలి పేరమ్మ మనవడు, తులసి పుత్రుడు కంభంపాటి సుబ్రహ్మణ్యం తాను పుట్టిన గ్రామంలో శ్రీకృష్ణ మందిరాన్ని నిర్మించడం హర్షించదగ్గ విషయమని పితాని అన్నారు. గజల్ శ్రీనివాస్ తన గానామృతంతో పాటలు పాడి సభీకుల్ని ఉత్సాహపరిచారు. సర్పంచ్ చింతపల్లి రాజు (చంటి), హిందూ ధర్మ పరిరక్షణ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

'పది' పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

కాళ్ల: పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. కాళ్ల హైస్కూల్‌లో 250, కోపల్లెలో 250, కలవపూడిలో 130, ఏలూరుపాడు జెడ్పీ హైస్కూల్‌లో 230 మంది చొప్పున విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు ఎంఈఓలు శనివారం తెలి పారు. 17 నుంచి ప్రారంభమయ్యే పరీక్షలు ప్రతి రోజూ ఉదయం 9.30 నుంచి మధ్యా హ్నం 12.45 గంటల వరకు నిర్వహించనున్నారు. 17న తెలుగు, 19న హిందీ, 21న ఆంగ్లం, 24న గణితం, 26న భౌతిక శాస్త్రం, 28న బయాలజీ, 31తేదీన లేదా ఏప్రిల్ 1 సోషల్ పరీక్షలు నిర్వహిస్తారని ఆయన స్పష్టం చేశారు.

ప్లాస్టిక్ రహిత సమాజం నిర్మిద్దాం



నరసాపురం : గాంధీజీ విగ్రహం సెంటర్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం



పాలకొల్లు సెంట్రల్: డీఎన్నార్ కళాశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

నరసాపురం: సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని మున్సిపల్ కమిషనర్ ఎం అంజయ్య సూచించారు. స్వర్ణ ఆంధ్రా, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలను వవరిస్తూ శనివారం పట్టణంలోని బస్టాండ్ నుంచి శివాలయం సెంటర్, గాంధీజీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. గాంధీజీ విగ్రహం వద్ద ప్లాస్టిక్ రహిత సమాజం నిర్మిద్దామని ప్రతిజ్ఞ చేశారు. ప్లాస్టిక్ కవర్లు వినియోగించినా, అమ్మినా భారీ జరిమానాలు విధిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మునిపల్ డీఈ ప్రవీణ్‌చంద్ర, ఆర్ఐ అడబాల నానాజీ, శనిటరీ ఇన్‌స్పెక్టర్ వేంద్ర త్రినాథ్ పాల్గొన్నారు.

పరిశుభ్రత అందరి బాధ్యత

నరసాపురం రూరల్: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతని తహసీల్దార్ తలారి రాజరాజేశ్వరి అన్నారు. కార్యాలయ ఆవరణలోని పిచ్చి మొక్కలు, చెత్త సిబ్బందితో కలిసి ఆమె తొలగించారు. స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో కళాశాలలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

పాలకొల్లు సెంట్రల్: పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మునిసిపల్ కమిషనర్ బి.విజయసారథి అన్నారు. శనివారం స్థానిక దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ప్రతిజ్ఞ చేశారు. ప్రిన్సిపాల్ శోభారాణి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు. స్థానిక జీవీఎస్‌వీఆర్ఎం మునిసిపల్ పాఠశాల, పాలకొల్లు మండలం పెదగరువు ప్రాథమిక పాఠశాలలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేశారు. లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వచ్ఛ ఆంధ్ర, ఆరోగ్య ఆంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అద్దాల ప్రతాప్‌కుమార్ మాట్లాడుతూ నిత్యం మనం తీసుకునే ఆహారంలో 80 శాతం ప్లాస్టిక్ వాడకంతో వచ్చిన ఆహారమేనని, దీంతో అనారోగ్యాలకు గురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు టౌన్–1, –2 ఫీడర్లు, ఏబీ స్విచ్‌ల నిర్వహణకు పట్టణంలో ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 10 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ కె.మధు కుమార్ తెలిపారు. యడ్లబజార్, ఎంఎంకే స్కూల్, సుబ్బారాయుడు టెంపుల్, వరధనం రోడ్డు, భార్గవినగర్, మెయిన్‌రోడ్డు, టెలిఫోన్ ఎక్చేంజ్, బ్యాంకు స్ట్రీట్, పెదగోపురం, శంభుని పేట ఏరియాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

అధ్వానంగా ఏటిగట్టు లైటింగ్

నరసాపురం : స్థానిక గోదావరి ఏటిగట్టు పొడవునా వీధి లైట్ల పరిస్థితి అధ్వానంగా ఉంది. ఎక్కడా సవ్యంగా లైట్లు వెలగడం లేదు. కొన్నిచోట్ల పోయిన లైట్ల స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేయడం లేదు. వలందరరేవు, లలితాంబ ఘాట్ వద్ద, పడవల రేవు తప్పిస్తే ఏటిగట్టు పొడవునా మరెక్కడా వీధి దీపాలు వెలగడం లేదు. ప్రతి రోజూ ఏటిగట్టు ప్రాంతానికి సాయంత్రం వేళల్లో పట్టణవాసులు పెద్ద సంఖ్యలో షికారుకు వస్తారు. రాత్రిపూట వీధి దీపాలు వెలగకపోవడంతో ఆ ప్రాంతమంతా అంధకారంతో ఉండి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

ఎండిపోతున్న మొక్కలు



రైల్వే స్టేషన్ రోడ్డులో డివైడర్ల మధ్య ఎండిన మొక్కలు

నరసాపురం: మునిసిపాలిటీలో మొక్కల పెంపకం కార్యక్రమం అధ్వానంగా మారింది. రూ.లక్షలు ఖర్చుపెట్టి చేపట్టిన మొక్కల పెంపకం లక్ష్యం నెరవేరకుండా పోతోంది. పట్టణంలో ఫలుధపాలుగా మొక్కలు నాటారు. వాటి సంరక్షణను అధికారులు గాలికి వదిలేశారు. దీంతో గోదావరి గట్టు, వైఎస్ కళాశాల రోడ్డు, ఎన్టీఆర్ కాలనీ, నందమూరి కాలనీ, బస్టాండ్ ప్రాంతం, రైల్వేస్టేషన్ రోడ్డు ప్రాంతాల్లో నాటిన మొక్కలు కనిపించడంలేదు. దూడలు తినేయడం, నీరు పోయడం వంటి రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో కొన్ని చచ్చిపోయాయి.

ముగిసిన అంతర్జాతీయ సదస్సు

భీమవరం: విష్ణు ఇంజినీరింగ్ కళాశాలలో స్మార్ట్, సస్టైనబుల్ ఎనర్జీ సిస్టమ్స్ రెండో అంతర్జాతీయ సదస్సు శనివారం ముగిసింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ మంగం వేణు మాట్లాడుతూ పరిశోధకులు, విద్యావేత్తలు, పరిశ్రమ నిపుణులకు స్మార్ట్ అండ్ సస్టైనబుల్ ఎనర్జీ సిస్టమ్స్‌లోని తాజా ఆవిష్కరణలు, అభివృద్ధిని పంచుకునేందుకు అంతర్జాతీయ సదస్సు ముఖ్య ఉద్దేశ్యమన్నారు. సదస్సు టెక్నికల్ చైర్ పర్సన్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ యడ్ల రాజు మాట్లాడుతూ ఎనర్జీ సిస్టమ్స్‌లో ఏఐ అండ్ ఎంఎల్ స్మార్ట్ గ్రిడ్స్‌లో ఎల్ఓటీ, పునరుత్పాదక ఇంధన సాంకేతికతలకు సంబంధించిన ఆరు టెక్నికల్ ట్రాక్‌లు నిర్వహించామన్నారు. వైస్ ప్రిన్సిపల్ ఎం.శ్రీలక్ష్మి సత్కార, తదితరులు పాల్గొన్నారు.

పాలకొల్లు మాస్టర్ ప్లాన్‌పై సమీక్ష



మాస్టర్ ప్లాన్ సమీక్షలో పాల్గొన్న మంత్రి నిమ్మల

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు పట్టణాన్ని 2045 సంవత్సరానికి పరిసర గ్రామాలతో కూడిన 78 చదరపు కిలో మీటర్ల పరిధికి పెంచుతూ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టౌన్ ప్లానర్స్ ఆఫ్ ఇండియా, ఏపీ రీజియన్ చాప్టర్ అంచనాలు తయారు చేయనుంది. దీనిపై శుక్రవారం రాత్రి స్థానిక మునిసిపల్ కౌన్సిల్ హాలులో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అధ్యక్షతన భాగస్వాముల సమావేశం నిర్వహించారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్యపై చర్చించారు. పూడిక చేసిన ప్రభుత్వ, ప్రైవేటు చెరువులను గృహ వినియోగ భూమిగా చూపించాలని, పరిశ్రమలు తొలగించిన ప్రదేశాల్లో ఇళ్ల నిర్మాణాలకు ప్లాన్‌లు ఇచ్చేలా కృషి చేయాలని కోరారు. వీటిపై మంత్రితోపాటు అధికారులు సానుకూలంగా స్పందించారని చెబుతున్నారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ రీజనల్ డైరెక్టర్ ఎస్ శ్రీనివాస్, టౌన్ ప్లానింగ్ ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అధికారి వి.సుధాకర్, మునిసిపల్ కమిషనర్ బి.విజయసారథి, టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్ టి.వీరబ్రహ్మం, మునిసిపల్ అధికారులు, చాంబర్స్ సభ్యులు పాల్గొన్నారు.

మండల పరిషత్ సమావేశంలో గందరగోళం

టీడీపీ నేతల వ్యాఖ్యలతో వాగ్వివాదం



మాట్లాడుతున్న ఎంపీపీ వెంకట నారాయణరెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే పితాని, జెడ్పీటీసీ గౌరీ సుభాషిణి



వాకౌట్ చేయడానికి సిద్ధపడిన ప్రజా ప్రతినిధులు

పెనుమంట్ర: పెనుమంట్ర మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో టీడీపీ నేతల వ్యాఖ్యలతో గందరగోళ పరిస్థితి నెలకొంది. శనివారం సాయంత్రం ఎంపీపీ కర్రి వెంకట నారాయణరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పెనుమంట్ర–2 ఎంపీటీసీ సభ్యుడు గండి రామారావు మాట్లాడుతుండగా ఎమ్మెల్యే పితాని వెంట వచ్చి గ్యాలరీలో కూర్చున్న పెనుమంట్ర వాటర్ డీసీ చైర్మన్ వెలగల బులిరామిరెడ్డి, జుత్తిగ టీడీపీ నేత గొలుగూరి శ్రీనివాసరెడ్డిలు రామారావును కించపరిచేలా వ్యాఖ్యలు చేశారు. దీంతో రామారావుకు మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు తమనంపూడి వీర్రెడ్డి మద్దతుగా టీడీపీ నాయకులతో వాగ్వాదానికి దిగారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులు, గ్రామ సర్పంచ్‌లు ఆగ్రహం వ్యక్తం చేస్తూ వాకౌట్ చేయడానికి సిద్ధపడడంతో ఎంపీపీ కలుగజేసుకుని వారిని సముదాయించారు. టీడీపీ సభ్యులను ఎమ్మెల్యే పితాని మందలించడంతో వైఎస్సార్ సీపీ సభ్యులు శాంతించారు.

నిధులు దుర్వినియోగం కాలేదు

ఎంపీపీ వెంకట నారాయణరెడ్డి మాట్లాడుతూ మండల పరిషత్‌లో ఎంపీటీసీ సభ్యులందరికీ సమానంగా రూ.90 లక్షల నిధులు కేటాయించామని, అనంతరం ఎన్నికలు రావడంతో పనులు నిలిచిపోయాయని, నిధులు దుర్వినియోగం కాలేదని చెప్పారు. మండల పరిషత్‌లో ఫర్నిచర్ ఏర్పాటుకు తమ సొంత నిధులు వెచ్చించామని తెలిపారు. ఎన్నికల అనంతరం ఎటువంటి పనులూ పూర్తి చేయలేకపోయామన్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ మాట్లాడుతూ ఆచంట నియోజకవర్గంలో 2014–19 సంవత్సరంలో మంజూరయిన రూ.47 కోట్ల నిధులు వృథాగా పోయాయని ఆరోపించారు. తమ ప్రభుత్వం నాన్ లేఅవుట్ భూముల్లోనూ రోడ్లు, విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు. ఒక దశలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు తమ నాయకులు సభలో చేసిన గందరగోళానికి వారి తరపున క్షమాపణ చెబుతున్నానని పితాని అన్నారు. జెడ్పీటీసీ కర్రి గౌరీ సుభాషిణి మాట్లాడుతూ స్థానిక ప్రజా ప్రతినిధుల పాలన రెండేళ్లు కోవిడ్‌లోనే గడచిపోయిందని, ఇంకో ఏడాది కాలంలో హామీలను నెరవేర్చాల్సి ఉందని తెలిపారు. వివిధ శాఖల అధికారులు నిధులు లేమితో అసంపూర్తి సమాధానాలతో సమావేశాన్ని ముగించారు. సమావేశంలో తహసీల్దార్ వై.రవికుమార్, ఎంపీడీఓ పి.శామ్యూల్, ఉపాధ్యక్షులు–1, –2 వాసంశెట్టి కిరణ్, ఈది అనిత, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

వైభవంగా వీరభద్ర స్వామి విగ్రహ ప్రతిష్ఠ



అన్న ప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు



భద్రకాళి సమేత వీరభద్ర స్వామి

పెనుగొండ: పెనుగొండ మండలం సిద్ధాంతం గ్రామం ఆచంట వారి వీధిలో కొలువైయున్న భద్రకాళి సమేత వీరభద్ర స్వామి వార్ల ఆలయ పునఃప్రతిష్ఠ వేడుక శనివారం కనులపండుగ నిర్వహించారు. వేదమూర్తి పూజ్యం దుర్గా సత్యనారాయణ మూర్తి మంత్రోచ్ఛరణల నడుమ ఆచంట రాము, నాగమణి, ఆచంట చిన్న, కస్తూరి, గుద్దటి దత్తాత్రేయ, కరుణ దంపతులచే వీరభద్ర స్వామి గణపతి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వార్ల విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభం ఏర్పాటు కార్యక్రమం వేడుకగా నిర్వహించారు. తొలుత గోమాత దర్శనం, స్వామి వార్ల కల్యాణం, భక్తులచే శిఖరంపై బూరెలు వేయు కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు, సిద్ధాంత ఆడపడుచులు స్వామివారిని దర్శించుకొన్నారు. భారీ అన్నసమారాధనలో అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

ఉన్నత విద్యతోనే దేశానికి మేలు



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న కళాశాల యాజమాన్యం

భీమవరం: పేదలు ఉన్నత విద్యను అభ్యసించడం ద్వారా తన కుటుంబానికే కాకుండా దేశానికి మేలు కలుగుతుందని భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. శనివారం భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల వార్షికోత్సవం సందర్భంగా ప్రిన్సిపల్ కేవీ మురళీకృష్ణంరాజు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కళాశాల వ్యవస్థాపకుడు సాగి రామకృష్ణంరాజు గ్రామీణ ప్రాంతమైన చినఅమిరంలో ఇంజనీరింగ్ కళాశాల స్థాపించి ప్రపంచానికి ఉత్తమ ఇంజనీర్లను అందించారన్నారు. కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు సాగి ప్రసాదరాజు, సాగి రామకృష్ణనిశాంతవర్మ అకాడమిక్ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు గోల్డ్, సిల్వర్ మెడల్స్ అందించారు. సీఎస్ఈలో 9.71 పర్సెంట్ మార్కులు సాధించిన బంక ధార్మిక్ పలు విభాగాల్లో మూడు బంగారు పథకాలు సాధించి రికార్డు సృష్టించిన సందర్భంగా అంజిబాబు చేతుల మీదుగా సత్కరించారు. అలాగే జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులకు నగదు బహుమతులు అందించగా రాష్ట్ర స్థాయి అధ్యాపక క్రికెట్ టోర్నమెంట్‌లో నాలుగు సార్లు విజేతగా నిలిచిన కళాశాల అధ్యాపక క్రికెట్ బృందానికి రూ.80 వేల విలువైన క్రికెట్ కిట్‌ను అందించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఎం.జగపతిరాజు, ఉపాధ్యక్షుడు గోకరాజు రామరాజు, తదితరులు పాల్గొన్నారు.

వినియోగంలోకి క్లాప్ వాహనాలు

సాక్షి స్పందన



క్లాప్ వాహనంలో చెత్త వేస్తున్న సిబ్బంది

భీమవరం(ప్రకాశం చౌక్): గత ప్రభుత్వంలో జిల్లాలోని మున్సిపాలిటీలకు క్లీన్ ఆంధ్రప్రదేశ్ పేరిట చెత్త సేకరణ కోసం 149 క్లాప్ వాహనాలు ఇచ్చారు. జిల్లాలో పాలకొల్లులో మాత్రమే వాహనాలు ఉపయోగించుకుంటున్నారు. మిగిలిన మున్సిపాలిటిల్లో క్లాప్ వాహనాలు మూలన పడేశారు. దీనిపై ఇటీవల సాక్షిలో క్లాప్‌కు మంగళం శీర్షతో కథనం ప్రచురితమైంది. దీనిపై భీమవరం మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి స్పందించారు. నిరూపయోగంగా ఉన్న క్లాప్ వాహనాల్లో 15 వాహనాలకు మరమ్మతులు చేయించి గత మూడు రోజులుగా వాటిని చెత్త సేకరణకు ఉపయోగించుకుంటున్నారు.